# మళ్ళీ పెళ్ళి

## రేవతి

అర్ధరాత్రి తలుపు తట్టి పిచ్చిదానిలా వాకిట్లో నిల్చున్న లతని చూచి–

"లతా! నువ్వు .... నువ్వు ...." ఆశ్చర్యంతో నోరు తెరిచాను.

"అవును. లతనే ... నా మనస్పంతా కలత.... నా జీవితమే వ్యధ...." లత ఏదో చెబుతోంది. "నా జీవితమే అగాధంగా తయారైంది సారధి. మోసానికి బలైపోయాను" లత గుండెల్లోంచి వస్తున్నాయి మాటలు.

"నన్ను నమ్ము సారధీ. ఇదినిజం ఇది నిజం నేను చెప్పేది నిజం...." అంటూ చెప్పుకు పోసాగింది లతలో శోకం మూర్తీభవించి వుంది. నేను మాత్రం ఆశ్చర్యంతో వింటున్నాను.

* * *

అంతా అయోమయంగావుంది. ఇల్లు అంతా హడావిడిగావుంది. అందరూ సంతోషంగా తిరుగుతున్నారు. నాకు మాత్రం ఏమీపట్టనట్టుగా ఏదో దిగులుగా వుంది. ఎందుచేత? నా పెళ్ళికనుక – నా పెళ్ళి యింత తొందరలో అదీ శేఖరంతో– నేనే నమ్మలేకపోతున్నాను. ఒకవైపు సంతోషం ఇంకోవైపు విచారం. శేఖరం అంతమంచి మనిషినీ, త్యాగమూర్తినీ భర్తగా పొందుతున్నాననే సంతోషం, ప్రేమించి పెళ్ళిచేసుకుందా మనుకున్నా మధును పొందలేకపోయాననే బాధ ఈ రెంటింటితో నా మనస్సు బరువెక్కి–ముభావంగా ఓ మూల కూర్చొ మంటోంది.

ఆ రోజు మధుతో జరిగిన సంభాషణ జ్ఞాపకం వస్తే మాత్రం మధంటే రోత పుట్టకమానదు. దీని కంతటికీ కారణం మధుకాదా? ఆరోజు అతనే కనక బలవంతంగా సినిమాకు రమ్మనకపోతే తను వెళ్లేదా? ఈ ఘోరం జరిగేదా? కాని మధు ఒప్పుకోడు.

ఆ సంఘటన జరిగిన మర్నాడే మధు నడిగింది – "మధూ! పెద్దవారి నడిగి ముహూర్తం పెట్టించు. పెళ్ళిచేసుకుందా" మని.

దానికి మధు "లతా! యింక మనకి పెళ్లి జరగదు. జరగకూడదు" అన్నాడు

"ఏం, ఎందుకని?"

"అదేం ప్రశ్న లతా! అంతా జరిగి పోయాక పెళ్లంటే నేనేం చేసేది?"

"అయితే నువ్వు నన్ను ప్రేమించ లేదా, నన్ను నీతోపాటు సినిమాలకి, షికారకి తీసుకెళ్ళలేదా? పెళ్ళిచేసుకుందా మనలేదా?"

"ఆవేశపడకు లతా! అది నేను కాదన్ను. నిన్ను నేను ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ప్రేమిస్తానుకూడా .... కాని ఇంత జరిగింతరువాత నిన్ను భార్యగామాత్రం అంగీకరించ లేను."

"ఇది నీ వల్ల జరిగింది కాదా ? నువ్వు చేసిన దానికి నేను శిక్షనుభ వించాలా ? ఇదేనా నీ ప్రేమ ? .... మాట్లాడవేం మధూ ?"

"నేను నిన్ను నిజంగా ప్రేమించాను కనుకనే పెళ్ళి చేసుకోలేనని నిష్కర్షగా చెబుతున్నాను. పెళ్ళిచేసుకుని క్షణక్షణం నిన్ను చూస్తూ కుమిలి పోయేకంటె దూరమై పోవడమే మంచిదని నా అభి ప్రాయం."

"మధూ ! నన్నన్యాయం చెయ్యకు. నీ బలవంతం వల్లనే, నీకు కోపం వస్తుం దనే, నేను నీతో సినిమాకు వచ్చాను. కాని ఈ సంఘటన జరుగుతుందని ఇదరం కల్లోకూడ అనుకోలేదుగదా! ఒకరకంగా ఈ సంఘటనకి కారణం నీవు కాదా ! ఆ రోజు నీవు కాదా సెకండ్ షో సినిమాకు తీసికెళ్ళింది ? నీ వల్ల కాదా నేను సర్వం పోగొట్టుకుంది ?

"లతా ? అంతా నావల్లనే కానీ నువ్వు నా ఎదురుగా చెడిపోయినతరువాత నేను నిన్ను పవిత్రంగా చూడలేను. కారణం ఏదైనా నువ్వు నీ శీలాన్ని పోగొట్టుకున్నావు. నువ్వు నా భార్యకావ టానికి నా మనస్సంగీకరించదు."

"మధూ ! ఆ రోజు, ఆ కిరాతకుడి చేతుల్లో మగాడివి నిన్ను నీవే రక్షించుకో లేనపుడు అబలను, అసహాయురాల్ని నేను ఎలా రక్షించుకోగలను ? ఆఖరికి ఆత్మ రక్షణకోసం, ఆడదానికి అన్నింటికంటే ముఖ్యమైన శీలాన్ని కాపాడుకోవడం కోసం; చివరి క్షణంవరకు పెనుగులా డేను. అది నీకు తెలియదా ? నా తప్పే ముంది ?"

"నిన్ను రక్షించవలసిన బాధ్యత మగా డిగా నాకుందని తెల్సుకొని ఆ క్షణంలో నా శరీరాన్ని నా వశంలో లేకుండా చేశా డా దుర్మార్గుడు. ఆఖరికి వాదెవడో ఈ క్షణంలో తెల్సినా ప్రాణాలతో వదల్ను" మధు ఆవేశంలో ఊగిపోయాడు.

"వాణ్ణి చంపడంవల్ల మన సమస్య తీరదు. నీతోనే నా జీవితం ముడిపడి వుంది. నిన్నే నా వూహల్లో చూసు కున్నాను. నిన్ను చేసుకుని మన కలలు పండించుకుందా మనుకున్నాను. కానీ నువ్విలా అంటావనుకోలేదు మధూ,"

"నువ్వెన్ని చెప్పినా నా మనస్సు నిన్ను భార్యగా స్వీకరించదు లతా, నేను నీకు చేయగలిన సహాయం కేవలం నీకు మరో వరుణ్ణి చూసి పెళ్లి చెయ్యా డమే. నువ్వనుకున్నంత త్యాగమూర్తిని కాదు లతా ! నాలో స్వార్థం ఎక్కువ. నాకు కావలసిన భార్య ఒక అరవిచ్చిన మల్లెవువ్వులా వుండాలే కాని వాడి పోయిన గులాబిలా కాదు."

"చాలా థేంక్సు మధూ ! నీ సహాయా నికి. నాక్కాబోయే వరుణ్ణి నువ్వు వెద కక్కర్లేదు. నా విషయం చెప్పి నేనే చేసుకుంటాను. ఎవరీన్ని మోస పుచ్చనక్కర్లేదు." నా ఆవేశం కట్టలు తెంచుకుంది ప్రపంచంలో ద్వేషం, అసహ్యం నా ఒళ్లంతా పాకి నట్టయింది.

"సరే ! నీ యిష్ట ప్రకారం నీ విష యం చెప్పే ఒప్పిస్తాను కాని, నేను మాత్రం నిన్ను చేసుకోలేను. నన్ను క్షమించు లతా !"

"నీలాంటి అసమర్థుణ్ణి, స్వార్థ

పరుణ్ని చేసుకోవడం నాకే సిగ్గు. ఛీ! ఈ జన్మలో నీ ముఖం చూడను."

ఆ రోజుతో మధు అంటె నా అణు వణువు అసహ్యంతో నిండి పోయింది. నిజానికి మధుని నేను ప్రేమించాను. అతనూ మనస్ఫూర్తిగా ప్రేమించాడు కాని విధివక్రించింది. అతని ఎదురుగానే నా శీలాన్ని కోల్పోయాను. కారణం, అతనే, వద్దన్నా సినిమాకు తీసికెళ్లాడు. వచ్చేదార్లో ఎవడో దుర్మార్గుడు అతన్ని చావు దెబ్బ కొట్టి నన్ననుభవించాడు.

* * *

మధు, శేఖరు రూంమేట్సు. శేఖరంటే నాకు మంచి అభిప్రాయం వుండేది. అమాయకుడిలా వుండేవాడు. కాని మధులో ఏదో ఆకర్షణ నన్ను అతని వైపుకి లాక్కుంది. శేఖర్‌కి మాత్రం ఏం తక్కువ? మధు చెప్పిన నా కథ విని కూడా సంతోషంతో నన్ను చేసు కోవటానికి ఒప్పుకున్నాడు. మా అమ్మా నాన్నలను ఒప్పించి పదిమందిలో సగ ర్వంగా నా మెళ్ళో మూడుముళ్లు వెయ్యా డానికి సిద్ధపడ్డాడు. శేఖర్‌లాంటి సహృ దయుడు నాభర్తగా దొరికినందుకు మధు లాటి స్వార్థపరుడు నానుండి దూరమై పోయినందుకు నా మనస్సులో సంతోషం తొణికిసలాడింది.

నా ఆలోచనల్లోనే తంతులన్నీ ముగి శాయి. ముచ్చటగా మూడుముళ్లు వేసి, ముందు జీవితానికి నాంది అయిన మూడు రాత్రులు గడపడానికి గదిలో ప్రవేశిం చాడు శేఖర్. నాకుమాత్రంఅంతాశూన్యంగా వుంది. శేఖరాన్ని చేసుకున్నందుకు సంతోషంగాఉన్నా నాలోప్రేమంతా మధు కొల్లగొట్టేడని బాధగావుంది. నా శీలాన్ని ఏ పశుబలమో అనుభవించిన తరువాత శేఖరాన్ని ఏ విధంగా సుఖపెట్టాలో తెలియటం లేదు. నా అంతరాత్మమాత్రం అంగీకరించటం లేదు.

శేఖర్ అడుగులో అడుగు వేసు కుంటూ నెమ్మదిగా నన్ను జేరేడు.

"లతా! ఏమిటీ మౌనం! ఈ రోజు మనం మనస్ఫూర్తిగా, సంతోషంగా గడపాలి. ఇదే మనకి శాశ్వతం కావాలి."

శేఖర్‌ని యింత దగ్గరగా చూడ్డం ఇదే మొదటిసారి. పెళ్ళి జరిగినప్పుడు నాకు తెలివేలేదు. మధుతో అతన్ని చూసినా నాకేమీ ప్రత్యేకత కన్పించలేదు. కాని మధుకి సహాయంచేసే మంచి స్నేహితు డనే అభిప్రాయం మాత్రం వుండేది. నా పరిస్థితి ఎంతో విచిత్రంగా వుంది. శేఖర్‌కి అంతా తెల్సు. ఏం చెప్పడానికి నా గొంతు పెగలటల్లేదు. పెదాలు బిగు సుకు పోయాయికి మనస్సులో ఎన్నో భావాలున్నాయి కాని మాటలు రావటం లేదు.

శేఖర్ నా చెయ్యి తన దగ్గరకు తీసు కుంటూ "లతా! నాకంతా తెల్సు. అది మర్చిపో. మొదటి చూపులోనే నీతో నా మనసు ముడిపడిపోయింది. కాని మధు నీవు ప్రేమించుకున్నారని తెల్సి నేను, నా ప్రేమ,ఆశ మూగగా వున్నాం." అన్నాడు. అతని కళ్ళు సంతోషంతో మెరిసి పోతున్నాయి. నాకు మాత్రం ఎంతో బాధగావుంది. శేఖరాన్ని పవి త్రంగా వుంచాలనె తపనతో నా మనసు అల్లాడిపోతోంది.

"శేఖర్ నేను అపవిత్రను. నా వల్ల




నీవు అపవిత్రం కావదు. నా శీలం చెడిపోయింది, నీవు పవిత్రంగా వుండటమే నాకు ఆనందం."

క్షణం మౌనంగా ఆలోచించి అతడు అనునయంగా ఇలా అన్నాడు :

"నువ్వు నిజంగా పిచ్చిదానవు లతా! ఎవడైనా తన ఎంగిలినే అసహ్యించుకుంటాడా! నువ్వు నా గురించి బాధ పడకు."

"నువ్వనేదేమిటో నాకర్థం కావటం లేదు శేఖర్."

"అవును లతా! ప్రేమ నిప్పు లాంటిది. ఒకసారి దానికి గురైతే,ఫలిస్తే జీవితం వింతకాంతులలో నిండిపోతుంది. లేకపోతే నిలువునా దహించుకుపోతాడు. ఆ దహించుకుపోయే స్థితి చాల భయంకర మైనది. అదే ద్వేషంగా మారి స్వార్థాన్ని బలపరుస్తుంది. అటువంటి పిచ్చిలో ఏదైనా చేసాడు మనిషి."

శేఖర్ చెప్పేది నాకేం అర్థంకావటం లేదు. అంతా విచిత్రంగా వుంది. "ఏమిటి శేఖర్, నువ్వేదైనా ఫిలాసఫీ మాట్లాడుతున్నావా?"

"లేదు. అంతా నిజం. నీమీద ప్రేమ వల్లే, నువ్వు, మధు కల్సి తిరుగుతుంటే మనసు నా వశం తప్పేది. కాని సభ్యత కోసం పైకేమీ కన్పించనివ్వలేదు. నువ్వు నావైపు చూసి చిరునవ్వు విసిరితే నీకళ్ళమెరుపు చూసి పరవశించి పోయేవాణ్ణి."శేఖర్ ఆవేశంలో ఏదో చెప్పబోతున్నాడు.

"శేఖర్! నిన్ను కేవలం మధు స్నేహితుడుగా, చిరునవ్వుతో పలకరించేదాన్ని మంచివాడివనే సదభిప్రాయం తప్ప నా మనసులో ఇంకేమీ వుండేది కాదు."

శేఖర్ నేను చెప్పేది వినిపించుకొనే స్థితిలో లేడు. "మీ యిద్దరి ప్రేమ ఫలించి పెళ్ళివరకు రాసాగింది. మధుని, నిన్ను వేరుచేసి ఎలాగైనా నిన్ను చేసుకోవాలనే పట్టుదల నాలో ఎక్కువైంది. మధుతో స్నేహం కంటే నీతో దాంప

త్యం నాకు కావాలనిపించింది. అందుకే...అందుకే మీరు సినిమాకి వెడు తున్నట్లు తెల్సి వచ్చేదాకా మీ కోసం కాశాను. మధుని కావాలనే కదలకుంత పడేటట్టు కొట్టేను. లతా! యిదంతా నీ మీద ప్రేమతోనే చేశాను. యిప్పటికి నా ఆశ ఫలించినీవు నా దానవైనావు."

ఒక్క నిమిషం కాలం స్థంభించి పోయింది నా శరీరంలో రక్తం మండి పోయింది. శేఖర్ యింత దుర్మార్గుడా? "శేఖర్! నీ స్వార్థం గురించి నా మనస్సు, నా ఆశలు మంట కలిపావా? మధు జీవితం నాశనం చేశావా? నువ్వింకా నన్ను త్యాగబుద్ధితోను, మంచి మనసు తోను ఆదరిస్తున్నావని ఆనందించాను. నీలో స్వార్థం యింత కఠినంగాను,భయం కరంగాను ఉంటుందనుకోలేదు." అతనికి దూరంగా పోయి కూర్చున్నాను.

శేఖర్ నా దగ్గరగా జేరి తన చేత్తో నా తల నిమురుతూ "లతా! దీనికి కారణం నువ్వు కాదా! నిన్ను పొందా లని కదా మధుని తొలగించి నా స్వంతం చేసుకున్నది? నాకక్కవలసింది పొంద టంలో తప్పేముంది? నిన్ను ఆరాధిం చాను. అందుకే యిలా చేశాను లతా!"

అతని స్పర్శే నాకు అసహ్యాన్ని కలిగిస్తోంది. శేఖర్‌లో నాకు రాక్షసరూపం కన్పించసాగింది. మధు, నేను మనసులు కలిసి తనువులు మరిచి గడపవలసిన ఈ రాత్రి నిలా చేసిన శేఖరం గాలే నాకు వెగటనిపించింది.

"లతా! మనం హాయిగా ఈ రాత్రి గడిపేద్దాం. జీవితంలో వెన్నెల కురిపిం చుకుని మన ముందు జీవితాన్ని నందన వనంగా చేసుకుందాం లతా!' అని తన కౌగిల్లో బంధించ బోయాడు, ఆ క్షణంలో ప్రపంచంలో స్వార్థమంతా నాలో కలిగింది బతుకుమీద ఆశలేదు. జీవితం మీద విరక్తి వచ్చింది. ఏదో పశు బలంతో శేఖర్‌ను విదిలించి కొట్టేను. తల పగిలిపోయింది. అతడికి స్పృహ పోయింది. నేను నీ దగ్గరికి పారిపోయి వచ్చాను సారథీ అని ఏడ్వసాగింది లత.

'ఎంతపని చేశావమ్మా!సరే తలుపేసు కుని లోపలేవుండు నే నొచ్చేదాకా' అని శేఖరం గదికి వెళ్ళాను. తలకట్టుతో పడు కుని వున్నాడు వాడు. సారధి అడక్క ముందే ఇలా చెప్పాడు. "లతంటే నాకు చాల ఇష్టం. దుర్మార్గుడైన మధు వలలో పడుతోందనే బాధ పడేవాడిని. మధుతో సినిమా కెళ్ళి వస్తున్న లతని ఎవరు చెరిచారో నిజంగా నాకు తెలియదు. పిరికివాడు ఆమెని వదిలేసి నాదగ్గరకు వచ్చాడు. సంగతంతా నాకు వాడేచెప్పాడు లత మనసు గాయపడింది. తాను శీలం కోల్పోయాననుకుంటోంది. నిజానికి ఆ రౌడీ తనని పొదివి పట్టుకోగానే భయంతో స్పృహ కోల్పోయింది. నేను వెళ్ళి ఆమెను నా గదికి తీసుకు వచ్చాను. చెరపబడిన లక్షణాలేమీనాకగుపించలేదు ఆమె నిర్దోషి. నాకో ఆలోచనొచ్చింది ఆమెకి నచ్చ చెప్పి పెళ్ళి చేసుకున్నాను గుళ్లో. తానేదో చెడిపోయానని ఊరికే బాధపడుతుంటే — ఆ చెరిచిన వాణ్ని నేనేనని అబద్ధమాడాను, అది నమ్మింది. ఆ తర్వాత ఏంజరిగిందో నీకు తెలుసుగా అని వూరు కున్నాడు.

సారధి స్థిమిత పడి ఇంటికెళ్ళి లతతో అన్నీ చెప్పాడు. ఉదయమే లతతో పాటు వాళ్ళ ఊరు వెళ్ళి పెద్దలను ఒప్పించి నిజంగా మళ్ళీ పెళ్ళి జరి పించాడు.